క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు ఇలా.. టమోటా రూ.39. వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 95, కాకర 45, బీర 45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 45. దొండ 28, ఆలు 21, ఉల్లి 18, గోకర 45, దోస 15, సొర 11, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 75, అర్వి 35, మునగ 35, చిలగడదుంప 35, బీట్‌రూట్ 25, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 75, క్యాప్సికమ్ 55. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

టీపీసీసీ అధికార ప్రతినిధిగా సంధ్యారెడ్డి



ఎల్‌బీనగర్: టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఎల్‌బీనగర్‌కు చెందిన బొజ్జ సంధ్యారెడ్డిని నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా సంధ్యారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చే విధంగా పార్టీ నాయకులతో కలిసి పని చేస్తానన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీ సమస్యలు పరిష్కరించి సుందరంగా తీర్చిదిద్దుతానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్–1 సంక్షేమ సంఘం నాయకులు బుధవారం కార్పొరేటర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, శివారెడ్డి, జైహింద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: బైరామల్‌గూడలోని నిర్మాణ దశలో ఉన్న ఫ్లై ఓవర్ కుప్పకూలిన దుర్ఘటనలో క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్య సేవలందించటంతో పాటు వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఘటనా స్థలానికి చేరి దుర్ఘటన జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల కోడ్‌కు ముందే ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై తీవ్ర ఒత్తిడి చేశారని దీంతో సదరు కాంట్రాక్టరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవటంతోనే దుర్ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు.

డిప్యూటీ డీఈఓపై ఫిర్యాదు



దేవసేనకు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్

చంచల్‌గూడ: సైదాబాద్ డివిజన్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం అక్రమ పద్ధతిలో ప్రవేశాలు తీసుకుంటున్నా సైదాబాద్ డిప్యూటీ డీఈఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ ఆరోపిస్తూ హైదరాబాద్ జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేనకు ఫిర్యాదు చేశారు. నియమ నిబంధనలు పాటించకుండా అనధికారికంగా స్కూల్ ఏర్పాటు చేసిన అంశం డిప్యూటీ డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఫిర్యాదులో శ్రీనివాస్ పేర్కొన్నారు.

బాధితులను ఆదుకుంటాం



బాధితుడిని పరామర్శిస్తున్న సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: సాగర్ రింగ్ రోడ్డు ఫ్లై ఓవర్ ఘటనలోని బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులకు వారి కుటుంబాలకు అండగా ఉంటామని, మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



యోగా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



యోగాసనాలు వేస్తున్న నాయకులు

యోగా మార్గం.. ఆరోగ్య భాగ్యం

ఎల్‌బీనగర్: యోగా రోగాలను దూరం చేస్తుందని, ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా యోగా చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు, బండ్లగూడ హరిణవనస్థలిలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు యోగా చేసేందుకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం యాదవ్, భాస్కర్, నర్రె శ్రీనివాస్, విక్రాంత్‌రెడ్డి, ఆశోక్ పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్లో..

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో రెడ్డి సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షులు సంరెడ్డి భుజంగారెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

- చైతన్యపురి డివిజన్‌లోని మారుతినగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ రంగ నర్సింహ్మ గుప్తా పాల్గొని యోగాసనాలు వేశారు.

మన్సూరాబాద్‌లో..

యోగా మానవాళికి ఎంతో ఉపయోగమని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలోని నూతనంగా నిర్మించిన యోగా షెడ్ వద్ద యోగా గురువు భరత్‌భూషణ్ ఆధ్వర్యంలో పలు ఆసనాలు వేశారు.

మలక్‌పేట: యోగా చేయడం మానసిక ప్రశాంతత, ఆరోగ్య పరిరక్షణ దోహదపడుతుందని మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం సలీంనగర్ కాలనీ–1, 2లో సీనియర్ సిటిజన్స్ నిర్వహించిన యోగా దినోత్సవానికి ఆమె హాజరయ్యారు. యోగా గురువు కృష్ణ, సుందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, దత్తు, లక్ష్మణ్‌రావు, సుధామణి పాల్గొన్నారు.

- ప్రొఫెసర్స్ కాలనీలోని సెయింట్ జేవీయర్స్ హైస్కూల్ యోగా దినోత్సవం నిర్వహించి విద్యార్థులతో రకరకాల యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ హిజ్కియా మాట్లాడుతూ.. మనిషి శారీరక, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో దోహదం చేస్తుందన్నారు.



చంచల్‌గూడ జైల్‌లో యోగా చేస్తున్న ఖైదీలు

- మూసారంబాగ్ శాలివాహన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాలివాహన నగర్ పార్కులో యోగా దినోత్సవం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కోశాధికారి సదానందం, డిస్ట్రిక్ట్ గవర్నర్ చక్రపాణి పాల్గొని యోగాసనాలు వేశారు.

ఓల్డ్ మలక్‌పేట పల్టామ్ గార్డెన్‌లో..

చాదర్‌ఘాట్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఓల్డ్ మలక్‌పేట పల్టామ్ గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొని యోగా చేశారు. సభ్యులు గడ్డం శ్రీను, కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, అమర్నాథ్‌గౌడ్, రఘునాథ్, డాక్టర్ యాదగిరి, రమేష్‌కుమార్, అరవింద్‌యాదవ్, ప్రకాశ్‌రావు, అరవింద్ స్వామి గోయల్, అమీర్, సోహేల్ పాల్గొన్నారు.

అల్కాపురి కాలనీ కమిటీ హాల్లో..

దిల్‌సుఖ్‌నగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ అల్కాపురి కాలనీ కమిటీ హాల్లో యోగా గురువు ధర్మవీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి యోగా గురువు ధర్మవీర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, రాజగోపాల్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మాధవిలత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైలులో..

చంచల్‌గూడ: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం చంచల్‌గూడ జైలు ఖైదీలు యోగాసనాలు వేశారు. సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ పర్యవేక్షణలో ఖైదీలు, సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించారు.

- చంచల్‌గూడలోని కాలేడేరా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు.
- కుర్మగూడ డివిజన్‌లో బీజేపీ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక శిశు మందిర్ పాఠశాలలో యోగాసనాలు వేశారు.



శాలివాహన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..



చైతన్యపురిలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహ్మగుప్తా



మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణం వద్ద..



ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్లో..



యోగా గురూజీ ధర్మవీర్‌ను సన్మానిస్తున్న దేప సురేఖ భాస్కర్‌రెడ్డి



యోగా దినోత్సవంలో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



యోగా దినోత్సవంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పేదల పక్షాన భూ పోరాటం చేస్తాం



ప్రమాణం చేస్తున్న సీపీఎం నాయకులు

మన్సూరాబాద్: పేదల పక్షాన భూపోరాటం నిర్వహించి ప్రతి పేదవాడికి ఇంటి స్థలం సాధించే వరకు పోరాటం చేస్తామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భాస్కర్, కార్యదర్శి సభ్యులు పగడాల యాదయ్య అన్నారు. ఎల్‌బీనగర్‌లోని డా.బీఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద బుధవారం పేదల పక్షాన పోరాటం చేస్తామంటూ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని పౌరులందరికి కూడు, గూడు, గుడ్డ ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో పేర్కొన్నారని, కానీ.. నేటి పాలకులు అవి కల్పించడంలో విఫలం అయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్న పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కును సాధించుకునేందుకు పేదలు భూపోరాటం చేస్తే పోలీసులు కేసులు నమోదు చేయటంపై మండిపడ్డారు. వనస్థలిపురం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి పేదలు, దళితులపై చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకునే సందర్భంలో పోలీసులు పేదలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్, కీసరి నర్సిరెడ్డి, ఎల్లయ్య, వీరయ్య, వెంకన్న, మనోహర్, శ్రీనివాస్, సుగుణ, కృష్ణయ్య, గోపినాయక్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మహ్మద్ జాఫర్

చంచల్‌గూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుర్మగూడ డివిజన్ మాదన్నపేటకు చెందిన మహ్మద్ జాఫర్ (45) గత కొంతకాలంగా పక్షవాతంతో పాటు మెదడు వ్యాధితో బాధ పడుతున్నాడు. రోజు లాగే బయటకు వెళ్లిన జాఫర్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని హోమం



చాదర్‌ఘాట్: ప్రజల ఆకాంక్ష మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ అనితానాయక్ ఆధ్వర్యంలో బుధవారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి గుడిలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. దేశ ప్రజలు సుఖశాంతులు, సుభిక్షంగా ఉండాలని అదే విధంగా రాష్ట్రానికి మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని హోమం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యానంద్, దేవర రాజేశ్వర్‌రావు, రాఘవేందర్, కృష్ణ, కట్టా మల్లేశం పాల్గొన్నారు.

‘దశాబ్ది దగా’ ర్యాలీని విజయవంతం చేయాలి



నాయకులతో చర్చిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

చైతన్యపురి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం ‘దశాబ్దిదగా’ పేరుతో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. చైతన్యపురిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి సంకేపల్లి సుధీర్‌రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి దశాబ్ది దగా కార్యక్రమంపై కార్యాచరణ గురించి నాయకులతో చర్చించారు. చైతన్యపురిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుంచి దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వరకు గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించే నిరసన ర్యాలీలో వివిధ పథకాల బాధిత ప్రజలు పాల్గొనేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శశిధర్‌రెడ్డి, నర్సింహయాదవ్, సురేందర్‌రెడ్డి, వేణుయాదవ్, స్వర్ణమాధవి, మతీన్‌బాయ్, మక్సూద్ అలీ, రాజశేఖర్, రమేష్‌నాయక్, జైపాల్‌రెడ్డి, శ్రీధర్, కృష్ణారెడ్డి, రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఈఓ శ్రీనివాసశర్మ

చంపాపేట: తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వేద పండితులచే మన్యుసూక్త సహిత వేద పారాయణం నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుధీర్‌రెడ్డి ఆలయ అర్చకులు, సిబ్బందిని సన్మానించారు. అనంతరం స్వామివారిని పురవీధులలో రథోత్సవాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదం వితరణ చేశారు. నల్లా రఘుమారెడ్డి, రాజిరెడ్డి, శివగౌడ్, తలారి సత్యప్రకాష్, రోజారెడ్డి, వసంత, ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ, అర్చకులు అంబయ్య, శంకర్ శర్మ, సంతోష్, అశోక్, మురళీధర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి



ఖిల్లా మైసమ్మ దేవాలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ ఆలయంలో డివిజన్ అధ్యక్షులు నగేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్, మురుకుంట్ల అరవింద్ శర్మ మాట్లాడుతూ.. మంత్రి సబితాఇంద్రారెడ్డి చొరవతో కోటి రూపాయలు పురాతన ఖిల్లా మైసమ్మ ఆలయ అభివృద్ధికి కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తూ, నిత్యనైవేద్యాలు జరిగేలా అర్చకులను కేటాయించి వారికోసం జీతాలను పెంచడం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాజీద్, శ్రీనివాస్, లింగస్వామి గౌడ్, మురళీధర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలి



ఫ్లై ఓవర్ కూలిన ప్రదేశంలో వివరాలు తెలుసుకుంటున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, సామ రంగారెడ్డి

హస్తినాపురం: ఫ్లై ఓవర్ కూలడానికి కారణమైన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సాగర్‌రింగ్‌రోడ్డులో రెండు పిల్లర్ల మధ్య చేస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణం కూలి పది మంది వరకు గాయపడిన ప్రదేశాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. కాంట్రాక్టర్ 30 శాతం వరకు కమీషన్ ఇస్తూ ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం మూలంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించి కాంట్రాక్టర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, నర్సింహయాదవ్, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత లోపమే..

నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంతోనే కూలిపోయిందని అందుకు కారణమైన కాంట్రాక్టర్‌ను అరెస్ట్ చేయాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సాగర్ రింగ్‌రోడ్డులో జరిగిన ఘటనా ప్రదేశాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి భూ కబ్జాలపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధి పనులపై పెట్టకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి, ఆకుల శ్రీవాణి పాల్గొన్నారు.



ప్రొ.జయశంకర్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రొ. జయశంకర్ సేవలు స్ఫూర్తిదాయకం

తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొ. జయశంకర్ చేసిన సేవలు మరువలేనివని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం వనస్థలిపురంలోని హుడా పార్కులో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల్లోని జయశంకర్ విగ్రహాలు, చిత్రపటాలకు వివిధ పార్టీల నాయకులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

–వనస్థలిపురం/చైతన్యపురి



విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొలె జగన్నాథం



చంపాపేటలో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న లక్ష్మీప్రసన్న



చైతన్యపురిలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం